క్లుప్తంగా

ఎమ్మెల్యే రాంబాబును కలిసిన ఎస్సై, పీపీ



ఎమ్మెల్యే అన్నా రాంబాబును సన్మానిస్తున్న ఎస్సై మహేష్

మార్కాపురం: గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబును మంగళవారం మార్కాపురంలోని ఆయన నివాసంలో మార్కాపురం జిల్లా ఆరో అదనపు కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలు నాయక్, గిద్దలూరు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన మహేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి, సన్మానించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సత్వర న్యాయం అందించాలని వారికి ఎమ్మెల్యే సూచించారు.

అంబేడ్కర్ భవన్‌కు స్థలం కేటాయించాలని వినతి



ఏఓకు వినతిపత్రం ఇస్తున్న దళిత సంఘాల నాయకులు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ సబ్ కలెక్టర్ కార్యాలయం ఏఓకు దళిత సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. అధికారులు చొరవచూపి స్థలం వెంటనే కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు జె.నాగయ్య, ఎస్.కాలేబు, జి.అంకయ్య, చినబాబు, నాగేంద్ర, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బాబా నగరోత్సవం



బాబా నగరోత్సవంలో పాల్గొన్న భక్తులు

మార్కాపురం: గురుపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక నెహ్రూ బజారులోని బాబా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజల అనంతరం నగరోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై బాబా విగ్రహాన్ని ఉంచి ఊరేగించారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, మందిర అధ్యక్ష కార్యదర్శులు గోపాలుని హరిహరరావు, పేరం సత్యనారాయణ, శ్రీశైల దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలు డాక్టర్ సీహెచ్ కనకదుర్గ, మందిర ఉపాధ్యక్షులు రామడుగు గోపి, కోశాధికారి నాగరాజు, సభ్యులు గోపాలుని కృష్ణమోహన్, కరీం, పవన్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆడిట్ ప్రజావేదిక వాయిదా

- సిబ్బంది కూలీల మధ్య వాగ్వాదం



ఆడిట్ అధికారులతో వాగ్వాదం చేస్తున్న కూలీలు

ముండ్లమూరు: మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆడిట్ ప్రజావేదిక రసాభసాగా సాగింది. అక్రమంగా రికవరీ రాస్తున్నారని కూలీలు, నాయకులు, గ్రామస్తులు ఆడిట్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటిగా బొప్పూడివారిపాలెం, జమ్మలమడక, పులిపాడు, నాయుడుపాలెం, ఉమామహేశ్వరపురం గ్రామాలకు సంబంధించి ఆడిట్ నివేదికలను వినిపించారు. కొలతల్లో పెద్ద ఎత్తున తేడాలు ఉన్నాయని, అక్రమాలు జరిగాయని తెలిపారు. కెల్లంపల్లి గ్రామస్తుల నుంచి ఎలాంటి ఫిర్యాదు లేకుండా అక్రమాలు ఎలా తేలుస్తారని కూలీలు, నాయకులు ఆడిట్ అధికారులను నిలదీశారు. మధ్యాహ్నం అనంతరం ఆడిట్ నిర్వహణలో ఎస్‌ఆర్‌పీ సుబ్బారావు తీరుపై అనుమానాలు ఉన్నాయని తెలియజేశారు. దీంతో ఎస్‌ఆర్‌పీ ఆడిట్ కోసం కొంత డిమాండ్ చేశారని ఆ మొత్తం ఇవ్వక పోవడం వలనే సిబ్బందిపై పెద్ద మొత్తంలో రికవరీ చూపించారని ఆరోపించారు. ఆడిట్ రాష్ట్ర డైరెక్టర్ జగదీష్‌కుమార్ సముదాయించినా వినకపోవడంతో అధికారులు ప్రజావేదికను మధ్యలో ముగించి వెళ్లారు. ఇప్పటికే శింగరాయకొండ, కంభం, బేస్తవారిపేట మండలాల్లో ఎస్‌ఆర్‌పీ సుబ్బారావు పని చేశాడని ఆయా మండలాల్లో రీ ఎంక్వయిరీ చేసి అతని పై చర్యలు తీసుకోవాలని నాయకులు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మారెడ్డి, డ్వామా పీడీ శీనారెడ్డి, ఏపీడీ పద్మశ్రీ, ఆడిట్ సిబ్బంది, ఏపీఓ కొండయ్య పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

- ఆగస్టులో అమృత్ 2.0 టెండర్లు పిలుస్తాం
- ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్



ముండ్లమూరు: రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: అమృత్ 2.0 పథకం ద్వారా తాగు నీటి పథం అందుబాటులో తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. స్థానిక నగరపంచాయతీ కార్యాలయంలో నగపంచాయతీ అభివృద్ధిపై కమిషనర్ మహేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం సమీక్ష సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ పెరుగుతున్న పట్టణాన్ని దృష్టిలో ఉంచుకుని 5 ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పులిపాడు నుంచి నూతన వాటర్‌లైన్ ఏర్పాటు చేసి ఇంటింటికీ 135 లీటర్ల తాగు నీరు ప్రతి రోజూ అందిస్తామని చెప్పారు. ఆగస్టులో టెండర్లు పిలిచి ఎన్‌ఏపీ చెరువును రూరల్ ప్రాంతాలకు కేటాయిస్తామన్నారు. దీనికి గాను సీపీడబ్ల్యూ స్కీం ద్వారా రూ.50 లక్షల నిధులతో నూతన ఫిల్టర్ బెడ్ మంజూరు చేయనున్నట్లు తెలిపారు. నగర పంచాయతీలో 15వ ఆర్థిక సంఘంలో మిగిలిన రూ.500.00 లక్షల పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. టీడీపీకి చెందిన కౌన్సిలర్లు, నగరపంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య గైర్హాజరయ్యారు. కౌన్సిలర్లు మేడం మోహన్‌రెడ్డి, ఆవుల జ్యోతి, యెనుముల సరస్వతి, తాళ్లూరి బాబురావు, జగన్నాథం మోహన్‌బాబు, మార్కెట్ యార్డ్ చైర్మన్ వైవీ సుబ్బయ్య పాల్గొన్నారు.

కూలీలకు గిట్టుబాటు ధర కల్పించండి

ముండ్లమూరు: ఉపాధి పథకం ద్వారా కూలీలకు ప్రభుత్వం నిర్దేశించిన కూలి దక్కేలా చూడాలని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. ముండ్లమూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. ఎంపీపీ సుంకర సునీతాబ్రహ్మారెడ్డి, డ్వామా పీడీ శీనారెడ్డి, ఆడిట్ స్టేట్ డైరెక్టర్ జగదీష్, సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్

నవరత్నాల అమలుతో నవ చరిత



గడప గడపలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం టౌన్: నవరత్నాలు పథకాల అమలుతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నవ చరిత లిఖించారని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. పల్లెలు, పట్టణాల్లో అభివృద్ధి పనులు, పేద ప్రజల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మార్కాపురం పట్టణంలోని కోనేటి వీధిలో వార్డు కౌన్సిలర్ డాక్టర్ చప్పల్లి కనకదుర్గతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్లు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం జగనన్న సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కొనియాడారు. పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థీ చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో అమ్మ ఒడి, ఉన్నత చదువులు చదివేందుకు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన పథకాలు అమలు చేస్తున్నారన్నారు. నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. రైతులకు అన్ని విధాలా అండగా నిలుస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చారని పేర్కొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీసీ రోడ్డు ప్రారంభం

10 లక్షల రూపాయలతో వార్డులో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజల రాకపోకలకు అనువుగా రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, ఏఎంసీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు కొత్త కృష్ణ, సిరాజ్, షెక్షావలి, వనజాక్షి, హర్షిత, దూదేకుల ప్రసాద్, బుశెట్టి నాగేశ్వరరావు, కరీంబాషా, రోజ్‌లిడియా, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు తడికమళ్ల బాలసుబ్బారావు, డాక్టర్ మగ్బుల్ బాషా, ఉస్మాన్, మున్సిపల్ డీఈ సుబానీ తదితరులు పాల్గొన్నారు.

మిరప నారులో మెళకువలు పాటించాలి



మాట్లాడుతున్న ఎఫర్ట్ సంస్థ ఈడీ జేవీ మోహన్‌రావు

పెద్దారవీడు: మిరప నారు పెంచడంలో మెళకువలు తప్పనిసరిగా పాటించాలని ఎఫర్ట్ సంస్థ ఈడీ జేవీ మోహన్‌రావు అన్నారు. మండలంలో తోకపల్లిలో రిలయన్స్ పౌండేషన్, ఎఫర్ట్ సంస్థ ఆధ్వర్యంలో రైతులకు మిరప నారుపై మంగళవారం అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మిరప నారు, పంటలో ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రిసోర్స్ పర్సన్ లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ కషాయాలను ఎలా తయారు చేయాలో చేసి చూపించి వాటి ఉపయోగాల గురించి వివరించారు. డీపీఎం బాబూరావు, రిలయన్స్, ఎఫర్ట్ సభ్యులు సర్వేశ్వర రెడ్డి, జిగిషా, శివ, రైతులు పాల్గొన్నారు.

108 వాహనం ప్రారంభం



108 వాహనాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



అత్యాధునిక వసతులు చూపుతున్న సిబ్బంది మహబూబ్ బాషా


పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో సూపరింటెండెంట్ భాస్కర్ కుమార్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మండలానికి కేటాయించిన 108 వాహనాన్ని సర్పంచ్ చిత్తూరి హారిక మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గంటా వెంకట రమణారెడ్డి, నాయకులు గుమ్మా యల్లేష్, అమిరెడ్డి లక్ష్మీరెడ్డి, లాలూ నాయక్, వైద్యులు డాక్టర్ లక్ష్మీ కళ్యాణి, డాక్టర్ బాలఈశ్వరయ్య, డాక్టర్ మెర్సీ ప్రియాంక, హెడ్ నర్స్ ఎలిజిబెత్ రాణి, ఆరోగ్య మిత్రలు దర్శనం రాంబాబు, సంగటి మణికుమార్, 108 సిబ్బంది పాల్గొన్నారు.

108 వాహనాలు ప్రారంభం

కురిచేడు: అధునిక వసతుల కల్పనతో నూతన ప్రాణదాత వాహనాన్ని మండలంలో మంగళవారం ప్రారంభించారు. దర్శి, తాళ్ళూరు, కురిచేడుకు 108.. నూతన వాహనాలు వచ్చాయి. స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయం వద్ద, బోధనంపాడు శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం వద్ద పూజలు చేయించి ప్రారంభించారు.

రాగి పంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ముండ్లమూరు(తాళ్లూరు): రైతులు చిరుధాన్యాల సాగులో భాగంగా రాగి పంట సాగు చేసేటప్పుడు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి బి. ప్రసాదరావు తెలిపారు. తురకపాలెం రైతుభరోసా కేంద్రంలో రైతులకు చిరుధాన్యాలను మంగళవారం పంపిణీ చేశారు. రాగి సాగులో తీసుకోవాల్సిన మెళకువలను సూచించారు. మారుతి, భారతి, శ్రీచైతన్య రకాలు వెద జల్లే పద్ధతిలో ఎకరాకు నాలుగు కిలోలు సరిపోతాయన్నారు. కార్యక్రమంలో వీఏఏ నవీన్‌ఖ, రైతులు పాల్గొన్నారు.



రైతులకు చిరుధాన్యాలను పంపిణీ చేస్తున్న ఏఓ ప్రసాదరావు

సచివాలయాన్ని పరిశీలించిన స్పెషల్ ఆఫీసర్

కంభం: కందులాపురం-3 సచివాలయాన్ని మంగళవారం సాయంత్రం పంచాయతీరాజ్ ఎస్‌ఈ, మండల స్పెషల్ ఆఫీసర్ మాలకొండయ్య తనిఖీ చేశారు. సచివాలయంలో ప్రజలకు అందిస్తున్న సేవలు, ఇతర పనులపై ఆరా తీశారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ఏఎన్ఎంల పనితీరు పరిశీలించారు. జగనన్న సురక్షపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. జగనన్న సురక్షకు సంబంధించి ప్రజలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, అంగన్‌వాడీ కేంద్రాలను మహిళా పోలీసులు పరిశీలిస్తుండాలని సూచించారు. ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

నేడు కందులాపురంలో జగనన్న సురక్ష

కంభం: మండలంలోని కందులాపురం1,2 సచివాలయాల్లో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సయ్యద్ మస్తాన్ వలి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకున్న ప్రజలు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని సర్టిఫికెట్లు పొందాలని కోరారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై కఠిన చర్యలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో నిబంధనలు పాటించని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రసూల్ హెచ్చరించారు. మంగళవారం ఆయన నారాయణ టెక్నో స్కూల్‌తో పాటు వివిధ పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. తాగునీటి ట్యాంకులు, మరుగుదొడ్లను రోజూ శుభ్రం చేయించాలని చెప్పారు. వర్షాకాలం ప్రారంభమైనందున పరిసర ప్రాంతాల్లో మురుగు, ఖాళీ కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ కప్పులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శానిటరీ సర్టిఫికెట్‌ను ఏటా రెన్యువల్ చేయించుకోవాలని చెప్పారు.



నారాయణ స్కూల్‌ను తనిఖీ చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

జీవామృతంతో భూసారం పెంపు

ముండ్లమూరు: రైతులు దుక్కిలో ఘన జీవామృతం వేయడం వలన భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ అధికారి వెంకటరమణ తెలిపారు. పూరిమెట్ల రైతుభరోసా కేంద్రం పరిధిలో మంగళవారం రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. ఘన, ద్రవ జీవామృతం తయారీ విధానం, కావాల్సిన వస్తువులు గురించి వివరించారు. రైతు నల్లబోతు కృష్ణమూర్తి పొలంలో 200 కేజీల ఘన జీవామృతం తయారు చేసి చూపించారు. ప్రతి రైతు గ్రామంలో దొరికే ముడి సరుకులుతో సొంతంగా తయారు చేసుకొని పొలాన్ని సారవంతం చేసుకోవాలన్నారు. రసాయనాలు అధికంగా వాడటం వలన భూమి సారవంతం కోల్పోయి దిగుబడి తగ్గుతుందన్నారు. సిబ్బంది ప్రభాకరరావు, వెంకటేశ్వరరెడ్డి, నాగబ్రహ్మారెడ్డి, మహాలక్ష్మీ, కళ్యాణి, రైతులు పాల్గొన్నారు.



జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది

డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇమ్రాన్



ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాపరెడ్డితో రేషన్ డీలర్లు

మార్కాపురం: మార్కాపురం పట్టణ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మీర్జా ఇమ్రాన్ అలీబేగ్, కార్యదర్శిగా గుంటక భాస్కర్‌రెడ్డి ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో డీలర్ల సంఘ ఎన్నిక నిర్వహించారు. సంఘ ఉపాధ్యక్షుడిగా దొడ్డ బుజ్జి, కోశాధికారిగా గోపు సుబ్బులు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు, డీలర్లు కలిసి రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డిని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సన్మానించారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

ముండ్లమూరు (తాళ్లూరు): మండలంలోని శివరామపురం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, బలపాలు, పలకలు పంపిణీ చేశారు. దర్శికి చెందిన వాసవి గోల్డ్‌షాపు యజమాని దువతి రవికుమార్ తన తండ్రి చెంచయ్య జ్ఞాపకార్థం మంగళవారం ఐదు వేల రూపాయల విలువ గల విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఎంఈఓ ఎల్. సుధాకరరావు, ఉపాధ్యాయులు జీవీ సుబ్బయ్య పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు ఎనలేనివి



మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేపీ, వైఎస్సార్ సీపీ నాయకులు

- అల్లూరి, వంగవీటి, రోశయ్యకు ఎమ్మెల్యే కేపీ ఘన నివాళి

మార్కాపురం: మహనీయుల త్యాగాలను మరిచి పోమని, వారు చూపిన బాటలో నడుస్తూ వారి ఆశయ సాధనకు అందరం కృషి చేద్దామని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అల్లూరి సీతారామరాజు, వంగవీటి మోహనరంగా, కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి తన క్యాంపు కార్యాలయంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ప్రాణాలు పణంగా పెట్టారని కొనియాడారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం వంగవీటి మోహనరంగా, కొణిజేటి రోశయ్య విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, ఏఎంసీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్ డాక్టర్ చప్పల్లి కనకదుర్గ, పార్టీ ప్రధాన కార్యదర్శి పత్తి రవిచంద్ర, వార్డు ఇన్‌చార్జిలు రోజ్‌లిడియా, ఉత్తమకుమార్, రహ్మతుల్లా, తర్లుపాడు వైఎస్సార్ సీపీ నేత రామసుబ్బారెడ్డి, ఉస్మాన్‌బేగ్, నాలి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కొమరోలు: దేశం కోసం ప్రాణాలు అర్పించి అమరవీరునిగా అల్లూరి సీతారామరాజు చరిత్రలో నిలిచిపోయారని ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం ఎయిడెడ్ పాఠశాల కరస్పాండెంట్ బందుగుల నారాయణరెడ్డి తెలిపారు. పట్టణంలోని ఎస్‌బీఎస్‌ఆర్‌ఎం ఎయిడెడ్ పాఠశాలలో అమరవీరుడు అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు మంగళవారం అల్లూరి సీతారామరాజు జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. చిన్నారులకు అల్లూరి సీతారామరాజు వేషధారణ పోటీలు నిర్వహించగా విద్యార్థులు అల్లూరి సీతారామరాజు వేషధారణలో ఎంతగానో అలరించారు.

పెద్దారవీడు: మండలంలోని గొబ్బూరులో ఎస్ఎస్ వ్యవసాయ కళాశాలలో అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా మంగళవారం ఆయన చిత్రపటానికి అసోసియేట్ డీన్ డాక్టర్ ఆర్‌వీఎస్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సాయుధ పోరాటం ద్వారా ఆంగ్లేయులను దేశం నుండి తరిమికొట్టిన సమరయోధుడు అల్లూరి సీతారామరాజు..అని కొనియాడారు. ఏఓ బ్రహ్మారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తర్లుపాడు: మండలంలోని లింగారెడ్డి కాలనీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం అల్లూరి సీతారామరాజు జయంతిని హెచ్ఎం షేక్ మౌలాలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భరతమాత గర్వించే ముద్దుబిడ్డ అల్లూరి సీతారామరాజు అని ఉపాధ్యాయులు కొనియాడారు. అల్లూరి చరిత్రను విద్యార్థులకు వివరించి, ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.



పెద్దరవీడులో..



అల్లూరి వేషధారణలో అలరించిన చిన్నారులు



లింగారెడ్డి కాలనీ స్కూల్లో అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చిన్నారులు



దర్శి: వంగవీటి చిత్రపటానికి పూలమాల వేస్తున్న సుబ్బయ్య

ఘనంగా వంగవీటి మోహనరంగా జయంతి

దర్శి: వంగవీటి మోహనరంగా జయంతిని స్థానిక హర్షిణి ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో కాపు సంఘం, కాప్స్ రాక్స్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్, దర్శి ఏఎంసీ చైర్మన్ వైవీ సుబ్బయ్య, వేమా శ్రీకాంత్, ఉల్లిగురువార్జున, శెట్టినేని కోటి, బుడంగుంట్ల కోటయ్య, శెట్టి సుబ్బయ్య, కురంగి మహితేజ, కమతం కళ్యాణ్, వరికూటి అనిల్, వేమా సుబ్బారావు పాల్గొన్నారు.